# నైవేద్యం

అడగని దేవుడికి నైవేద్యం!
అడిగే భక్తుడికి ప్రసాదం!!
—ఇదీ మన పద్ధతి



— కృష్ణవాణి

ఆ వీధులన్నీ అలంకరించారు. మూల మూలల్లోని వారంతా ఆ వీధుల్లోకే చేరారు- విశాలమైన ఆ ప్రధాన వీధులన్నీ ఇరుకయిపోయాయి క్షణంలో. అదే క్షణంలోనే మామూలుగా ఇరుకైన వీధులు విశాలంగా కనిపించాయి. దానిక్కారణం ఆ రోజు దేవుడి వుత్సవం వూరేగింపు!

అదేం పండుగో-ఆ దేవుడెవరో- ఏదైతేనేం? ప్రసాదాలు, వరాలూ ఇచ్చే దేవుడేనని అందరి నమ్మకం. ఆ దేవదేవుడు ఫలానా రూపంలో వున్నాడని వర్ణించి ఎందుకిపుడు చెప్పటం?

ఏ రూపంలో వున్నా ఒక్కటే. "ఏ రాయయితేనేం?- పూజించటానికి!"

ఆ దేవుడి విగ్రహాలు ఎత్తులో వున్నాయి రథం మీద.

అర్చకులు మైకుల్లో-దేవుడు ఏ లోకంలో దాక్కున్నా వినిపించేలా యథాశక్తి స్తుతిస్తున్నారు.

సంప్రదాయాలన్నీ మిళితమై కనిపిస్తున్నాయి. బాజా భజంత్రీలు రథానికి కాస్త ముందుగా- డోలు డప్పులు మరికాస్త ముందర... వాటికి తగినట్టు తైతక్కలాడుతున్న బృందం... దోవ పొడుగూ అటూ ఇటూ హారతి పళ్ళేలు-కొబ్బరి కాయల బుట్టలూ పట్టుకున్న అమ్మాయిలూ, యువతులూ, ప్రౌఢలూ, వృద్ధులూ... పెట్రోమాక్సు దీపాలు మోస్తున్న కూలీలూ. . .

'ఊరేగింపు ఎప్పుడు ముగుస్తుందా-కూలీ ఎప్పుడు ముడుతుందాని తమ మీద చేరుకున్న చీకట్లను తిట్టుకుంటున్నారు. దీపాలని మోసే తమకి వెలుగెప్పుడొస్తుందో తెలియక నిర్లిప్తంగా కదులుతున్నారు- వాళ్ళల్లో తమకంటే బరువైన దీపాలని మోస్తున్న బాల కార్మికులకైతే దేవుడు కనిపిస్తున్నాడు! అయినా సరే చలించడం లేదు.

ఎప్పుడూ కనిపించే రోమియోలూ-అల్లరిమూకా-ఆశ్చర్యంగా ఆనాళ మాయమయ్యారు-నిముషాల్లో భక్త శిఖామణులయ్యారు.

మతానికి సమ్మతమైన బట్టలేసుకుని అలంకారాలు చేసుకుని తీర్థప్రసాదాలందించే వాళ్ళల్లో- కొబ్బరికాయలు అర్చకులకీ భక్తులకీ నడుమ తిప్పుతూన్న వాళ్ళల్లో- ధర్మహుండీలు పట్టుకున్న వాళ్ళల్లో- భక్తి పారవశ్యంతో (?) ఎగురుతూ కన్నులపండుగ చేస్తున్నవాళ్ళల్లో- కలిసిపోయి వున్నారు -"అరే వీళ్ళు మారిపోయారే?" అనిపించేలా.

కొబ్బరికాయలు కొడుతూ, హారతులు వెలిగిస్తూ భక్తుల కళ్ళల్లో దివాలు పడుతున్నారు అర్చకులు.

అన్ని వర్గాలవారూ-ఆస్తిక నాస్తిక మహాశయులూ- అటు భక్తుల్లో ఇటు నాస్తికుల్లో కలవలేనివాళ్ళూ- గుంపుల్లో నిలబడలేనివాళ్ళూ కాస్త ఎడంగా నిలబడ్డా- వారే మరో గుంపులా తయారయ్యారు.

'భక్తి ఫేషనయిపోయిందీ లోకానికి-'

'ఇదేం భక్తండీ బాబూ? మరీ ఇంత ఆర్భాటమా?'

'ఆ ఎగిరే వాళ్ళను చూశారూ? పచ్చి తాగుబోతులు నయం కాదూ.'

'కళ్ళు పోతాయండీ- లెంపలేసుకోండి-'

'దేవుడు లేడనటం కూడా ఈ నాటి ఫేషనేగా-'

'లేడనంటే మాత్రం సరా...'

ఎవరికి తోచినట్టు వాళ్ళు మాటాడేసుకుంటున్నారు- కాస్త ఎడంగా వున్నవాళ్ళు.

ఫుట్‌పాత్‌మీదా నిండిపోతున్నారు జనం. రోజూ దాన్నాసరాగా చేసుకుని బతికే బిచ్చగాళ్ళు కనిపించలా-

'ఏమయిపోయారు...' అనుకుని చూసేవాళ్ళంటే దూరంగా దూరంగా చీకట్లో కనిపిస్తారు దీనంగా.

కానీ ఎవరు చూశారూ?

'ఊరేగింపు తరువాత ప్రసాదం పంచుతారేమో- అన్న దానాలు చేసే పుణ్యాత్ములుంటారేమో-నా భాగం కూడా నీవే తిందువులే కన్నా...' అని ఆ చీకట్లో ఎదురుచూస్తూ నిలబడ్డ ఓ చంటిబిడ్డ తల్లి- మాతృహృదయం నిస్సత్తువగా యుగాల్ని గడుపుతోందని దేవుడికే తెలియనివ్వక దేవుణ్ణే నిర్బంధించారా భక్త శిఖామణులు?

ఎత్తులో కూర్చున్న దేవుడు-చిన్నగా అటూ ఇటూ కదులుతోంటే- మతిమెత్తని స్తుతులకు సంతోషపడి తృప్తిగా తలాడిస్తున్నాడనిపిస్తోంది. అదే నిజమయితే- ఫుట్‌పాత్ మీద ఆ కుర్రవాడి ఆకలి-నీరసం-నిస్సత్తువల మాటేమిటి?

పుణ్యంకోసం అంతా తహతహలాడుతున్నారు- ఇక్కడే చాలదు- పరలోకంలో కూడా సుఖజీవనం కావాలని ఆత్రపడుతున్నారు- ఇహంలోనే అణగిపోతున్న

వారిని గురించి ఆ పుణ్య కాలంలోనైనా ఇంత కూడా అనుకోరేమని దేవుడెందుకు మందలించలేదు? దేవుడి నోరెప్పుడో నొక్కేశారనుకుందాం- అంత పెద్ద రాతి రథం కదులుతోందే- వీళ్ళందరి హృదయాలూ కదలిపోవా?... అదే ఆశ్చర్యం!

ఆ కుర్రాడి కళ్ళు మూతపడటం ఎవడో గమనించే వుంటాడు. కానీ భక్తితో వనుకుంటారు- తిండి లేకున్నా మూతలుపడతాయని ఎలా తోస్తుంది?- అనుభవంలో లేనిదాయె!

'అంత భక్తి వుంటే ఆ గుంపులోకెళ్ళి ఎగ్గరాదూ? దండిగా ప్రసాదమైనా పెడతారు!'

ఎవడన్నాడో-ఎందుకన్నాడో ఎవరితో అన్నాడో... ఆ మాటలు గడియలు పడుతున్న కుర్రాడి చెవుల్లో పడ్డాయి. అంతే-గడియ లెక్కడివక్కడ తెగిపడ్డాయి. 'ప్రసాదం!' మాటకి కళ్ళు విచ్చుకున్నాయి. ఆశ చిగురించింది. నిన్న మొన్నటి రోజు ఈ వేళకి రెండుమూడుసార్లు ప్రసాదం దొరకబుచ్చుకున్నాడు. ఈ రోజు పొద్దుటి నుండీ ఎందుకనో దొరకనేలేదు. నిన్నటివరకూ కిందే వున్న దేవుడు ఈనాళ కొండలాంటి రథమెక్కి కూర్చున్నాడు. మరి ప్రసాదం అందుకనే ఇవ్వలేదో? ప్రసాదమైనా దొరకకుంటే నిన్నటికి ఎక్కడో పడిపోయేవాడే- ఇప్పుడు దొరకకపోతే తెల్లారేసరికి ఎక్కడ వుండాల్సొస్తుందో? ప్రసాదం కావాలి. బతకాలి. అందుకనైనా డప్పుల మధ్య కెళ్ళాలి- నోటితో అడగలేనివాడు దేవుడు- అయినా అతడికి ప్రసాదమేం ఖర్మ-వేరుగా నైవేద్యాలే అందుతున్నాయి. ఇప్పుడు తన డొక్క లెగిరిపోయేట్టు ఆడితేగానీ ప్రసాదం పడదేమో. గుంపులో కలిసి ఎగిరాడు కుర్రాడు.

కొత్తదనం వచ్చినట్టనిపించి-భక్తుల గుంపు కొత్తవాడికి చోటునిచ్చింది. కుర్రాడి చుట్టూ చేరి వాడిని మధ్యకి చేర్చారు.

డప్పులకో కొత్త వూపు.

జనాలకి మరింత ఆకర్షణ-

'చిన్న కుర్రాడు-ఎంత బాగా ఎగుర్తున్నాడో?' ఎవడో ఒకడొచ్చి పూలమాల వేశాడు కుర్రాడి మెడలో. మరొకడు మరో మాల! ఒకడు కుంకుమ దిద్దాడు కుర్రాడి నొసట.

శరీరమే బరువయ్యే క్షణాన ఇవన్నీ చిన్న ప్రాణం మోయగలదా? శక్తి నశిస్తూంది-నిస్సత్తువ పెరుగుతూంది. అదుపు తప్పుతోన్న కాళ్ళమీద తనే ఎగురుతున్నట్టు లేదు కుర్రాడికి- తన కాళ్ళని భూమే వచ్చి తగులుతోంది-యుద్ధం చేస్తూంది... అనిపించింది

'ఓహో-ఆహా' అన్నారు కొంతమంది. అనుకున్నారు మరి కొంతమంది. ఇంకొందరికి తామూ అలా ఎగురాలనిపించింది.

కుర్రాడి కళ్ళు అరకొర తెరుచుకుంటూ వాలిపోతూ పెట్రోమాక్సు దీపాల వెలుగులో చుట్టూ జనానికి కనిపించింది- అయితే అనిపించింది వేరొకటి!

'దేవుడు' ఎవరో గట్టిగా అరిచారు. మరిన్ని గొంతులు శృతికలిపాయి తరువాత వాడితో.

దేవుడి రథం ఆగిపోయింది.

యూనివర్శిటీలో చదువుతున్న
ఓ అబ్బాయి వేసే
ఎత్తుకి పై ఎత్తు వేసి
చిత్తు చేస్తున్న
ఓ యూనివర్శిటీ
అమ్మాయి కథ
చెక్
మేర్లపాక మురళి సీరియల్
అతి త్వరలో!

కూలబడ్డ కుర్రవాడు ఇంకా వూగిపోతూంటే అర్చకులు దేవుడిని వదిలి కుర్రాడిని చేరారు.

దేవుడు చిక్కమొహం వేసుకుని వెలవెలబోతూ కనిపించాడు.

కుర్రాడిలో 'దేవుణ్ణే' చూశారంతా!

భక్తిగా కళ్ళు మూసుకున్నారు. 'ఎంత అదృష్టం!' అనుకున్నారు చాలా మంది. హారతులు ఇచ్చారు. నైవేద్యం పళ్ళాలు విగ్రహాల ముందు మం మాయమయ్యాయి. కుర్రాడి ముం ప్రత్యక్షమయ్యాయి.

మరిన్ని కొబ్బరికాయలు చిట్లిపోతున్నాయి.

కిందకూలబడ్డా ఇంకా ఎగురుతూన్నట్టే వూహించుకుంటున్నాడు కుర్రాడు. కళ్ళు బలవంతంగా తెరచుకున్నాయి-తతంగం ఏదో చూడాలని. తనాశించింది ప్రసాదమే! కానీ ముందున్నది నైవేద్యం!! ఎక్కడికో పోబోతున్న ప్రాణం తిరిగొచ్చింది ఆశగా. పళ్ళాలన్నీ పూర్తిగా తడిమి చూశాడు ఆనందంగా- ఇంకా ముందర ఎన్నెన్నో నైవేద్యాలుగా వచ్చి చేరుతూనే వున్నాయి. సంతోషం-దుఃఖం కలిసిపోయాయి- 'అంతా తనకేనా?' అనుకోగానే.

అంతవరకూ కనిపించిన దేవుడు కుర్రాడి ముందు నుండి మాయమయ్యేసరికి భక్తిగా-ఆనందంగా నమస్కరించాడు మనసులోనే. ఇదంతా తనకే?! రేపు తినొచ్చు... ఎల్లుండీ... ఆ ఎల్లుండీ కూడా... అన్ని రోజులూ బతకొచ్చు. చేతులు పైకెత్తి ఆకాశం వైపు చూశాడు.

భక్తులంతా తమకేననుకున్నారు. తలలు వంచి 'ఆశీర్వాదం' తీసుకున్నామనుకున్నారు.

నైవేద్యం పళ్ళాలు మాయమయ్యాయి.

కుర్రాడికా విషయం అర్థంకాగానే పూర్తిగా ఒరిగిపోయాడు.

'దేవుని ఆశీర్వాదం ప్రత్యేకంగా పొందిన ప్రసాదం... ప్రత్యేక పూజ చేయించినవారికి ఇవ్వబడుతుంది. పూజ రేట్ల వివరాలు...' అంటూ మైకు ఎలుగెత్తి చెబుతోంది.

కుర్రాడి చెవులలో నుండి సముద్రఘోష సన్నగా వినిపిస్తోంది.